# 11. అన్వేషణ

"ఆపూర్యమాణమచలప్రతిష్ఠం
సముద్రమాపః ప్రవశన్తి యద్వత్ ।
తద్వత్ కామా యం ప్రవిశన్తి సర్వే
స శాన్తిమాప్నోతి న కామకామీ"

బస్సువెనుక సీట్లో ఎవరో భగవద్గీత శ్లోకం చదివి తమిళంలో అర్థం వివరిస్తున్నారు.

బస్సు నడుస్తూండగా రోడ్డుకిరువైపులా ఉన్నప్రాంతం తూర్పుగోదావరి జిల్లాలోని మెట్టప్రాంతంలా ఉండటంచూసి 'ఎక్కడికెళ్లినా భూమిస్వరూపం ఒక్కటే' అనుకుంది కిటికీపక్కన కూర్చున్న అనసూయ. సుదూరంగా ఎర్రని గుట్టలాంటి కొండ ఒకటి కన్పించింది. అదేకాబోలు అరుణాచలం అనుకొంటూండగానే చేలమీది చల్లనిగాలికి రెప్పలు మూతపడి మాగన్నులోకి జారుకుంది.

"తిరువణ్ణామలై... తిరువణ్ణామలై..."

కండక్టరు అరిచిన అరుపుతో ఉలిక్కిపడిలేచింది.

తోసుకుంటున్న ప్రయాణీకుల్లోంచి చిట్టచివరబస్సుదిగి బైటికొచ్చింది.

వేలూరులో ఉదయం ఏడింటికి ఎక్కినబస్సు తొమ్మిదిగంటల వేళకి అరుణాచలం చేరుకుంది. విపరీతమైన రద్దీతో ముడుచుకుని కూర్చోవడంవలన మోకాళ్ళలో కలుక్కు మంటోంది.

షెల్టరులోకి నడిచి వనజ, విమల ఎక్కడున్నారా అని చుట్టూ చూసింది. బస్సులో ముగ్గురూ ఒకచోట కూర్చోడానికి వీలుపడలేదు.

తమిళనాడు రాష్ట్ర రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ బస్‌షెల్టరు, చీపురు ముఖంచూసి ఎన్నాళ్లైందో అన్నట్టు గలీజుగా ఉంది. ముక్కులు బద్దలయ్యే యూరిన్ దుర్గంధం.

"అనసూయా! అక్కడే నిలబడిపోయారేంటి?" అని అరుపువినబడి చూస్తే వనజ విమలతోబాటు కాంప్లెక్స్‌బైట రోడ్డుమీద ఉంది. అనసూయ వెళ్లేసరికి ఆలయానికి ఎటువెళ్ళాలని ఎవర్నో వివరాలు అడుగుతోంది.

ఈ యాత్రలో భాగంగా రాత్రి వేలూరు చేరుకున్నారు. బస్‌స్టేషన్‌కి దగ్గర్లోవున్న 'సెల్లిఅమ్మన్ వసతి గృహం'లో బసచేసారు. వేలూరు బస్‌స్టేషన్ పెద్దది. నిమిషానికో బస్సు వచ్చివెళ్తోందక్కడ.

తెల్లవారుఝామునేలేచి, తలస్నానాలు చేసి బైటికొచ్చేసరికి పక్కనే సెల్లిఅమ్మన్ గుడిలోంచి గంటలశబ్దం ఆగకుండా విన్పిస్తోంది. లోపలికి వెళ్లేసరికి పూలసుగంధం, అగరుధూపం, కర్పూరపరిమళాలు ఆవరణంతా వ్యాపించివున్నాయి. గుడిలో కుట్టుడాకుల దొన్నెల్లో పంచిన నేతి పొంగలి ప్రసాదం రుచి ఇంకా జిహ్వమీద నిలిచేవుంది. పక్కనే ఉన్న బడ్డీదుకాణంలో చిక్కనిపాలతో కలిపిన స్ట్రాంగ్ కాఫీ తాగేసరికి ప్రాణాలు లేచొచ్చాయి.

వాళ్లలో వనజతప్ప మిగిలిన ఇద్దరూ యాభైఐదు దాటి రిటైర్మెంటుకి దగ్గర్లో ఉన్నవాళ్లే. పాతికేళ్ళకే యు.జి.సి. నెట్ పాసై లెక్చరర్‌గా చేరిన వనజ అందరి బాగోగుల్ని పట్టించుకుంటూ, అందరికీ తలలోనాలుకలాగ మసలుకుంటుంది. క్రితం సంవత్సరం ముగ్గురి జీవితాల్లోనూ జరిగిన మూడు సంఘటనలు ఈ ట్రిప్పు వేసుకోడానికి కారణాలు.

పెళ్లిమీద సదభిప్రాయంలేని వనజ ప్రేమించిన వ్యక్తి నాలుగేళ్ళ సహజీవనం తర్వాత ఆమెనుంచి దూరంగా వెళ్ళిపోయి మరో అమ్మాయిని పెళ్ళిచేసుకున్నాడు. మొదట్లో కొంత షాకైనా దాన్నే జీవితంలో గొప్ప విషాదంగా భావించి ఏడుస్తూ కూర్చునే తత్వంకాదు వనజది. టేకిటీజీ పాలసీగల ఆధునిక మహిళ వనజ. అయినా కొంత మానసికమైన అలజడి తప్పలేదు.

ఆర్మీలో మంచి ఉద్యోగంలో ఉన్న అనసూయకొడుకు యాక్సిడెంట్లో దుర్మరణం చెందడం ఆమె జీవితంలోని విషాదసంఘటన. ఎప్పుడూ ఏవో పుస్తకాలు చదువుతూ ఉండే అనసూయ దాన్ని జీవితంలో ఒక పార్శ్వంగానే స్వీకరించింది. కాని, ఈమధ్య కొంత తత్త్వచింతనకి లోనవుతూ వస్తోంది.

ఇక, తనకెదురైన సమస్యల్ని లోలోపల అతిక్లిష్టంగా మలుచుకుని డిప్రెసివ్ మూడ్‌లోకి వెళ్లిపోయి, ఆత్మహత్య చేసుకోబోయిన విమల కథ ఈప్రయాణానికి ముఖ్యమైన కారణం. దూరప్రాంతానికి తీసుకెళ్లి ఆమెలో కొంత విశ్రాంతభావాన్ని నింపాలని డాక్టరు సలహా. ఈ మధ్య విమల కాలేజ్‌కి లీవ్‌పెట్టి ఇంట్లో ఉండి పోతోంది. ఎవ్వరితో మాట్లాడడం లేదు.

సమయానికి దసరా సెలవులు కలిసివచ్చాయి.

ఎక్కడి కెళ్లాలనే ప్రసక్తివచ్చినప్పుడు స్వతహాగా చలం అభిమాని, చలం సాహిత్యాన్ని అవుపోసన పట్టేసిన అనసూయ సూచనతో అరుణాచలం ప్రయాణం పెట్టుకున్నారు.

చలం చివరి రోజుల్ని గడిపిన ప్రాంతాన్ని, చలాన్ని అంతగా ఆకర్షించిన రమణాశ్రమాన్ని ఒక్కసారన్నా చూడాలని ఆమె ఎప్పట్నుంచో అంటోంది. ఇంతదూరం వచ్చాంకదా, వేలూరు పరిసరాలుచూసి తర్వాత అరుణాచలం వెళ్దామంది వనజ. ముందు అరుణాచలం చూసాకనే ఇంకెక్కడికైనా వెళ్దామంది అనసూయ.

ఇరువైపులా దుకాణాల్తో సన్నని బజారుదారి, దుమ్మూధూళీ నిండిన పాతకాలంనాటి ఊరు.

"చలంగారు ఏమివెతుక్కుంటూ ఈ అరుణాచలానికి ప్రయాణమయ్యాడనే ప్రశ్నదగ్గర ఆగిపోతున్నాయి నా ఆలోచనలు" అంది వనజ.

"చలం అరుణాచలంలో రమణాశ్రమంలో పొందిన మనశ్శాంతి లాంటిదేదో మనకీ లభిస్తుందేమో" అంది అనసూయ కనుబొమలెగరేసి విమలను చూపిస్తూ.

రోడ్డుకి ఎడమవైపు చక్రాలబళ్లమీద తడిగుడ్డ వాసినకట్టిన పెద్ద పెద్ద బానలు. పక్కనే రాచ్చిప్పల్లో కారంకలిపిన పచ్చిమామిడికాయ ముక్కలు, ఉప్పులో ఉడికించిన పచ్చిమిరపకాయలు లాంటివి ఉన్నాయి. రెండు మూడు బళ్ళు దాటేక ఆ బానల్లో ఏముందో తెలుసుకోవాలనే ఆసక్తిని ఆపుకోలేక ఆగిపోయింది వనజ.

సిగనిండా పూలుపెట్టుకుని, ఉదయాన్నే తాంబూలం నములుతున్న ఆమె తెలుగులో చెప్పడం రాక డోకినీతో తీసి చూపించింది. నూకలు కలిపి తయారుచేసిన చోడి అంబలి అది. అయిదు రూపాయిలకి ఒక గ్లాసట. రూపాయికి నంజుకు.

"అంబలి మాటేమోగాని, నంజులు మాత్రం నోరూరిస్తున్నై" అంది వనజ. ఎండ నెత్తిమాడుస్తోంది. నెమ్మదిగా నడుచుకుంటూ ఆలయం ముందుకు చేరుకున్నారు. గుడిముందు ఒకే ఒక్క పూజాసామగ్రి దుకాణం. ఇత్తడి సామాన్ల దుకాణాలు మాత్రం చాలా ఉన్నాయి.

చూస్తే, మెడనొప్పెట్టేటంత ఎత్తైన రాజగోపురాలు నాల్గువైపులా, తూర్పు ముఖద్వారంనుంచి లోపలికి ప్రవేశించగానే తెలిసింది ఎంతటి విశాలప్రాంగణంలో కట్టబడిన ఎంతటి బృహదాలయమో అది. ఆలయానికి వెనక ధీరగంభీరంగా నిలిచిన అరుణాచలం. చెయ్యితిరిగిన చిత్రకారుడు శ్రద్ధగా గీసిన రంగుల చిత్రంలా ఉంది దృశ్యం.

"తెలుగు ప్రాంతాల్లో ప్రసిద్ధ దేవాలయాల్లాగ ఇక్కడి ఆలయాల్లో టిక్కెట్ల పేరుతో దోపిడీ ఉన్నట్టులేదు" అంది వనజ.

ఎత్తైన మొదటి ప్రాకారం నీడలో అలసిపోయి చతికిలపడ్డారు అనసూయ, విమల.

"ఇవాళ మన ప్రయాణంలో మొదటిరోజు, అప్పుడే అలసిపోతే ఎలాగండి" నవ్వింది వనజ. బైటికెళ్ళి వాటర్‌బోటిల్స్ కొనితెచ్చి ఇద్దరికీ ఇచ్చింది.

ప్రాంగణంలోని ఆలయాలన్నీ చూసుకుని మధ్యాహ్న హారతి సమయానికి గర్భాలయానికి చేరుకున్నారు. అరుణాచలేశ్వరుణ్ణి - అపీతకుచాంబికను పూలతో అలంకరించిన విధానాన్ని ముగ్గురూ కళ్లింతంతలు చేసుకుని చూసారు. ఉన్నికృష్ణన్ గొంతునుంచి జాలువారిన శివస్తోత్రమ్ ఓపక్క పంచాక్షరి మరోపక్క మంద్రస్వరంలో కర్ణపుటాల్ని తాకుతున్నాయి. మనసేదో తెలీని మార్మిక ప్రశాంతతకి లోనౌతోంది. ఆ ప్రశాంతతని భగ్నం చేస్తూ ఉండి ఉండి విన్పిస్తున్న గంటల శబ్దం.

బైటికొచ్చి మంటపంలో కూర్చున్నారు. ప్రసాదంగా ఇచ్చిన విభూతిని తన నుదిటినిండా పూసుకుని నవ్వడం మొదలుపెట్టింది వనజ.

"సన్యాసుల్లో కలిసిపోతున్నా" అని మళ్లీ నవ్వుతోంది.

"ఊరుకో అల్లరిపిల్లా!" అంది కాని అనసూయకూడా నవ్వాపుకోలేక పోయింది.

విమలమాత్రం వీళ్ల నవ్వుల్తో తనకేం ప్రమేయంలేనట్టు ఎక్కడో శూన్యంలోకి చూస్తోంది.

"గుళ్లోంచి బైటికిరాగానే ప్రశాంతభావంపోయి మామూలుగా అయిపోతాం ఎందుకండి?" అంది వనజ.

"అలా కాకపోతే అందరూ రమణమహర్షులైపోరూ" అంది అనసూయ, రమణుడు బాల్యంలో తపస్సులో కూర్చున్న నేలమాళిగను చూస్తూ.

గుడిబైట ఆటోవాళ్ళు "అరుణాచల ప్రదక్షిణం" అంటూ చుట్టుముట్టేసారు. మూడువందలకి మాట్లాడుకుని ఆటో ఎక్కేరు. ఆలయప్రాకారం దాటి నాలుగడుగులు వెళ్లేక ఆటో ఒక చిన్న సందులోకి మళ్లించి "ఇదే ఈశానలింగం, దిగండి దిగండి" అన్నాడు.

కొట్టారంలాంటి గదిలో నూనెదీపం వెలుగులో చిన్న లింగాకారం. నేలంతా నూనె వొలకబోసినట్టు పాదాలకంటుతున్న జిడ్డు, చేతులుజోడించేసి వచ్చి ఆటో ఎక్కేరు.

"ఈ పరదచ్చినంలో అష్టదిగ్బాలక లింగదరిశెనం సేసుకోవాల" అన్నాడు ఆటోవాలా వచ్చీరానీ తెలుగులో.

"అంటే ఇలాంటిమరో ఏడుచోట్ల ఆపేసి మమ్మల్నిలా నూనెజిడ్డులో నడిపిస్తావన్నమాట!" వనజన్నమాట అర్థమైందోలేదోకాని "ఆమ.. ఆమ..." అని నవ్వేడు ఆటోవాలా.

"శైవం ప్రబలంగావున్న రోజుల్లో నిర్మింపబడిన ఆలయాలివన్నీ. అవును వనజా, మిట్టమధ్యాహ్నం ఈ గిరిప్రదక్షిణ ఏమిటి, ఈ ఆలయ దర్శనాలేంటి?" అంది అనసూయ.

"మరేం చేద్దాం మేడమ్, రేప్పొద్దున్న చేద్దామా? అయ్యో, లగేజి వేలూర్లో వదిలేసొచ్చామే, పోనీ, రేపు మళ్ళీ వద్దామా?"

"చాల్లే పద" అంటూ చిరుకోపం అభినయించింది అనసూయ. ఆటో మరో నాలుగడుగులు నడిచేక రోడ్డుకు కుడివైపున చూపించి "ఇదే రమణాశ్రమం" అన్నాడు ఆటోవాలా.

"ఆపు... ఆపు..." అని అరిచింది అనసూయ. ఆటోలోంచి కిందికి దిగిపోయి నేనిక్కడుంటాను. ఆ అష్టదిక్పాలక లింగాలేవో మీరు చూసి రండిబాబూ" అంది.

వనజ "అమ్మాతల్లీ, ముందు ఈ ప్రదక్షిణేదో ముగించి కడుపులో కాస్తంత ఆహారం పడేసివచ్చి కావాల్సినంతసేపు ఇక్కడుండిపోదాం సరేనా" అంది.

ఎంతో దూరమనుకున్న గిరిప్రదక్షిణ ఇరవై నిమిషాల్లోనే ముగించేసాడు ఆటోవాలా.

హెూటల్లో రుచీపచీలేని సాంబారన్నం తిన్నామనిపించి, రమణాశ్రమానికి చేరుకున్నారు.

పచ్చని చెట్లతో నిండివున్న ప్రాంగణంలోకి అడుగుపెడుతూనే "ఈ గేటులోంచి చలంగారు ఎన్నిసార్లు నడిచివుంటారో" అంది అనసూయ. గేటుపక్కనున్న కౌంటర్లో చెప్పులు విడిచి లోపలికి నడిచేరు. విశాలమైన ప్రార్థనమందిరం. వెనక గోడకి రమణమహర్షి మధ్యవయస్సులో ఉన్నప్పటి పెద్దఫోటో, విప్పార్చుకుని చూస్తున్నకళ్ళు, చిన్న నవ్వుతో ఏదో చెప్పబోతున్నట్టున్న పెదవులు. మధ్యాహ్నం కావడం వలనో ఏమో హాలంతా ఖాళీగావుంది. ఆశ్రమవాసులు నివసించేవి కాబోలు నాలుగైదు కాటేజెస్. ఎంత అడుగులో అడుగువేసుకుంటూ నడిచినా అయిదు నిమిషాల్లో ఆశ్రమం చూడ్డం ముగిసిపోయింది.

ప్రార్థన మందిరానికి ఎదుట రమణమహర్షి ధ్యానం చేసుకున్న చిన్న గదిలాంటి ప్రదేశం గ్రిల్స్‌తో మూసివుంది. లతల్తో అల్లుకుని పొదరిల్లులా ఉందది. వాళ్ళక్కడ నిలబడి ఉండగానే పక్కనే ఉన్న పూలపొదలోంచి నెమలి ఒకటి హఠాత్తుగా బైటికొచ్చి క్రేంకరించుకుంటూ ధ్యానమందిరంపైకి ఎగిరింది. ధ్యానమందిరానికి రెండడుగుల్లో రమణ మహర్షి అవసానమందిరం ఉంది.

వయస్సుమీరి జీర్ణావస్థలో ఉన్న శరీరంతో విచిత్రమైన రూపానికి మారిపోయిన రమణుని ఫోటో ఒకటి ఉందక్కడ. కాస్సేపటి క్రితం ప్రార్థనమందిరంలో ఫోటోలో చూసిన రమణమహర్షి ఈయనే అంటే నమ్మేలా లేదు.

దాన్నిచూసిన అనసూయకి కడుపులో దేవినట్టైపోయింది. అక్కడ నిలబడలేక పరగులాంటి నడకతో బైటికొచ్చేసింది. కళ్ళు తిరుగుతున్నట్టన్పించి చెట్టుకింద తిన్నెమీద చేరబడిపోయింది.

"ఏమైంది... ఏమైంది..." అంటూ వెనకాలే వనజ పరుగెత్తుకొచ్చింది. కళ్లు మూసుకొని ఆలోచనలో ఉండిపోయింది అనసూయ. ఎంతటి ధ్యానపరులకైనా, లోకవ్యవహారాలకి దూరంగా జీవించినా, మహర్షులు భగవంతులు అనిపించుకున్నా శరీరంమాత్రం తనధర్మాన్ని ఏమారదా? రోగం, జర, మరణం అనేవిమూడూ చుట్టుముట్టక మానవా? అటువంటప్పుడు యోగవేదాంతాలకి అర్థమేమిటి? స్నానం పానం తిండి నిద్ర ఎవరికైనా తప్పనిసరి అవసరాలుకదా! ఇహలోక వ్యవహారాల్నుంచి దూరంగా పారిపోయే పిరికితనాన్నేనా సన్యసించడం అన్నారు! భోగి అనిపించుకున్న చలం ఏమాశించి ఈ యోగి ఆశ్రమందరికి చేరుకున్నాడు? తెలుగువాళ్ళకి దూరంగా ఇక్కడికి పలాయనించి ఓటమిని నెత్తికెత్తుకున్నాడెందుకు? అద్భుతమైన రచనాశైలిని విడనాడి మౌనాన్నాశ్రయించాడెందుకు?

గొంతు ఎండిపోతున్నట్లనిపించింది అనసూయకు. మంచినీటి కుళాయిదగ్గరకి నడిచి నీళ్లుతాగి, మొహాన చల్లని నీళ్లు చల్లుకుంది.

"భయపెట్టాసారేంటండి బాబూ" అంటోంది వనజ.

ఎవరెవరో యాత్రికులు బస్సులు, కార్లు దిగి ఆశ్రమం గేటులోపలి వరకూవచ్చి తొంగిచూసి, తిరిగి వెళ్లిపోతున్నారు.

"ఆశ్రమాలంటే భయపడే రోజులొచ్చేసాయి చూసారా" అంది వనజ.

"వనజా, ఇక్కడే ఎక్కడో చలంగారు నివసించిన ఇల్లు, ఆయన సమాధి ఉంటాయట, కొంచెం కనుక్కోవా" అంది అనసూయ. అరవైకి డెబ్భైకి మధ్యవయసున్న నలుగురైదుగురు మాత్రం ఆశ్రమంలో అటూ ఇటూ తిరుగుతున్నారు. వనజ ఎదురెళ్ళి ఒకాయన్ని పలకరించింది. చూస్తే ఆయన తెలుగువాడు.

"ఇక్కడికి దగ్గర్లోనే చలంగారు నివసించిన ఇల్లు ఉంటుందట, ఎక్కడో చెప్పగలరా."

"ఏ చలం?"

"గుడిపాటి వెంకటచలం. ప్రసిద్ధ తెలుగురచయిత".

ఆయనొక్కక్షణం దిక్కులుచూసి, పల్చని జుట్టులోకి చూపుడువేలు పెట్టిగోక్కుని "నాకు తెలియదు. ఆయనకేమైనా తెలుసేమో" అని మరొకాయన్ని చూపించాడు.

అక్కాడా అదే వరస.

"బోనీ, సొరిస్ తెలుసా? ప్రస్తుతం ఆవిడ లేరనుకోండి" మరింత అయోమయంగా చూసాడాయన "సొరిస్సా, అదేంపేరు?"

"హతోస్మి" అంది వనజ. "గేటు బైటికెళ్ళి కనుక్కుందాం రండి" అంది. రోడ్డు క్రాస్ చేసి పదడుగులు ముందుకేస్తే కొబ్బరిబొండాల తోపుడు బండొకటి కన్పించింది. కొబ్బరినీళ్లు తాగుతూండగా పదిబారల కవతల సమాధిలాంటిదేదో కన్పించింది. అనసూయకి ఎక్కడో చదివినట్టు గుర్తు రమణాశ్రమం గేటుకి దగ్గర్లోనే రోడ్డుపక్క చలం సమాధి ఉంటుందని.

పట్టరాని ఉద్వేగంతో అక్కడికెళ్లి చూస్తే సమాధిరాతిమీద కన్పించీ కన్పించని అక్షరాలు. దుమ్ముధూళి, రాలిన చెట్ల ఆకులు, సమాధి కొకపక్క చెత్తకుప్ప, మరోపక్క నాలుగు గోనెసంచుల్తో నీడ ఏర్పరచుకుని, దానికింద కూర్చుని అడుక్కుంటున్న లెప్పర్స్ జంట.

అనసూయకు ఆ సమాధిమీదపడి భోరున ఏడవాలన్పించింది. "ఇందుకా చలం ఇంతదూరానికొచ్చావు?" తనలో అనుకోబోయి పైకే అనేసింది అనసూయ.

అంతవరకూ స్తబ్దంగా, నిరాసక్తంగా వాళ్లవెంట తిరుగుతున్న విమల ఆలోచనలో పడిపోయింది.

ఎక్కడుంది మనశ్శాంతి, తాము ఏం వెతుక్కుంటూ ఇంత దూరానికి వచ్చారు? జీవితంలో కోల్పోయిందేదో ఆలస్యంగా తెలిసినప్పుడు శేషజీవితాన్ని వైరాగ్యం ఆవహిస్తుందా? ఇందరితో పోల్చుకుంటే నిజానికి తను ఏమైనా కోల్పోయిందా? తనను గాయపరచిన సంఘటనలు కళ్లముందు కొచ్చాయి విమలకి -

తనకారోజు చాలా ఆనందంగానూ, గొప్ప రిలీఫ్‌గానూ ఉంది. బి.టెక్. చేసిన కూతురు సుమకి నిన్నరాత్రే పెళ్లి జరిపించింది. అబ్బాయి హైదరాబాద్‌లోనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. త్వరలోనే అమ్మాయికీ అదే కంపెనీలో ఉద్యోగం వేయించుకుంటానన్నాడు. వాళ్లు కోరిన కట్నకానుకలన్నీ ఇచ్చి ఆడంబరంగా పెళ్లి జరిపించింది. అమెరికాలో ఈమధ్యనే ఉద్యోగంలో చేరిన కొడుకు విశాల్ పెళ్ళికి రాలేకపోయాడనే వెలితితప్ప మరెలాంటి లోటుపాట్లూ లేకుండా జరిగింది పెళ్లి. పిల్లలు చిన్నవాళ్లప్పుడే భర్త యాక్సిడెంట్లో పోయినా, ధైర్యంగా నిలదొక్కుకొని, ముందు టీచర్‌గా జీవితం ప్రారంభించి, లెక్చరర్ వరకూ ఎదిగి, పిల్లల్ని చదివించి ప్రయోజకుల్ని చేసిందని పెళ్లిలో అందరూ విమలను మెచ్చుకున్నారు.

విమల తనపిల్లలే తనకి రెండుకళ్లు అనుకుంది. ప్రాణాలన్నీ వాళ్లమీదే పెట్టి పెంచుకుంది. వాళ్లకోసమే కష్టపడి ఉద్యోగం మెట్లెక్కి పైస్థాయికి చేరుకుంది. వాళ్లు తనలాదేనికీ వెతుక్కోకూడదని అడగకముందే అన్నీ అమర్చిపెట్టింది. బిడ్డల ఎదుగుదలకి పునాదిగా నిలవడంకన్నా జీవితంలో ఆదర్శం ఏముంటుంది అనుకుంది. పైసాపైసా కూడబెట్టి వాళ్లకోసమే ఖర్చుచేసింది. చుట్టాలూ పక్కాలూ పిసినారి అని ముద్రవేసినా పట్టించుకోలేదు. పెళ్లిసందడంతా సద్దుమణిగిన నాలుగైదురోజులకి ఇంతవరకూ ఎప్పుడూ అనుభూతిలోకిరాని ఒంటరితనం ఒకటి చుట్టు ముట్టింది. కొడుకు హాస్టల్స్‌లో ఉండి చదువుకోవటంవలనో ఏమో, వాడు అమెరికావెళ్ళినా అన్పించని వెలితి ఇప్పుడు సుమ అత్తవారింటికి వెళ్లేసరికి తెలుస్తోంది. సందడి సందడిగా కబుర్లుచెప్తూ ఇంట్లో తిరిగిన ఆడపిల్ల లేనిలోటు కళ్లల్లో నీళ్లు తెప్పిస్తోంది. పగలంతా కాలేజ్‌లో క్లాసుల్తో గడిచిపోయినా, సాయంకాలం ఇంటికొచ్చేసరికి బిక్కుబిక్కు మన్పిస్తోంది. అందుకే నెలకొకట్రెండు సెలవురోజులు హైదరాబాద్‌కి ప్రయాణం పెట్టుకుని కూతుర్ని చూసివస్తోంది. వెళ్లినప్పుడల్లా రకరకాల స్వీట్లు, బట్టలు కొనుక్కెళ్తుంది. కూతురికి కొడుకు పుట్టేక విమల ప్రేమంతా వాడిమీదికి మళ్లింది.

వాణ్ణి మూడోఏటే బళ్లోవేసేసింది సుమ. అప్పట్నుంచీ వాడికి బండెడు పుస్తకాలు, హోమ్‌వర్కులు, బట్టీపట్టడాలు. విమల వెళ్లినా ఏ అరగంటో తప్ప వాడితో మాట్లాడ్డానికి లేదు. ఇంగ్లీషు రెయిమ్స్, టేబుల్సూతప్ప వాడికి తెలుగులో ఉన్న చిట్టిపొట్టి కథలు చెప్పడానికి లేదు. వాడికి కేటాయించిన ఆటలసమయం అరగంటా వాడు తుపాకి బొమ్మల్తోను, కార్లబొమ్మల్తోను ఆడుకోవాలి.

"వాడికి పిచ్చి పిచ్చి కథలూ, కబుర్లూ చెప్పి వాణ్ణి డైవర్ట్ చెయ్యకు" అందోసారి సుమ.

మనసు చివుక్కుమన్నా ఇప్పట్నుంచీ కొడుకుగురించి అవస్థపడుతున్న సుమను చూస్తే ముద్దొచ్చింది. దాని ఆరిందా తనానికి నవ్వొచ్చింది.

తర్వాత క్రమంగా కూతురింటికి వెళ్లడం తగ్గించింది.

అప్పుడప్పుడు నెట్‌లో చూస్తున్నా, రెండు నెలల ఆఫీసుపనిమీద విశాల్ ఇండియా కొచ్చాక తెలిసింది. వాడెంతగా ఎదిగాడో!

"పెళ్లి చేసుకోనాన్నా ఇక" అంటే "నీ ఇష్టమమ్మా" అన్నాడు.

'నా బంగారుతండ్రి నా మాట జవదాటడు' అనుకుంది విమల. అమ్మాయికోసం వెతకాల్సిన పనిలేకపోయింది. విమల కాలేజ్ ప్రిన్సిపాల్ కూతురు స్వాతి పి.జి. చేసింది.

యు.ఎస్.లో జాబ్ చేస్తున్నాడని తెలిసి ప్రిన్సిపాల్ తరచుగా విశాల్ గురించి అడుగుతూ ఉండేవాడు. పెళ్లిచూపుల్లో అమ్మాయి అబ్బాయి ఒకర్నొకరు ఇష్టపడ్డారు. ఆపైన ఇక విమల ప్రమేయం అక్కర్లేకపోయింది.

ప్రిన్సిపాల్ తనకూతురికి బస్తీలోకొన్న ఒక ఫ్లాట్ రాసిచ్చాడు. పదిలక్షల క్యాష్ అమ్మాయిపేరుతో బేంకులోవేశాడు. నగలు, వెండి సామాను చాలానే ఇచ్చాడు.

విశాల్ అప్పుడప్పుడూ పంపించిన డబ్బును జాయింట్ అకౌంటులో వేసివుంచింది విమల. దాన్లోనుంచి ఆరులక్షలు డ్రాచేసి కోడలికొకటి, కూతురుకొకటి వడ్డాణాలు చేయించింది.

వడ్డాణం ధరించడం అనేది విమలకొక తీరని కల. ఆడవాళ్లు చాలా మందిలాగే విమలకూ నగలమీద వ్యామోహం ఉంది. తనకి సావకాశం లేకపోయింది. తనకూతురు, కోడలు ధరిస్తే చూసి ఆనందించాలనుకుంది.

పెళ్లైన మరుక్షణం నుంచి విశాల్ పూర్తిగా ఆ ఇంటివాడైపోయినట్టు ప్రవర్తిస్తున్నాడు.

పెళ్లైన నాలుగోరోజే విశాల్ అత్తగారు "అయితే పెళ్లికి నీడబ్బుతోనే మీ అమ్మ నగలు, చీరలు కొన్నదన్నమాట. ఆవిడ సంపాదనంతా ఏం చేసిందట?" అంది.

"నా డబ్బు వేరు, మా అమ్మ డబ్బు వేరుకాదు" అని విశాల్ అంటాడని ఎదురు చూస్తున్న విమల "నన్నడక్కుండానే డబ్బుతీసి ఖర్చుపెట్టేసే వెందుకమ్మా, యు.ఎస్. వెళ్తే కొత్తకాపురానికెంత ఖర్చవుతుందో తెలుసా" అనేసరికి మనసుకి బాణం తగిలినట్టు విలవిలలాడింది. చాలామంది మగపిల్లల్లాగే విశాల్ తల్లినీ చెల్లినీ లోకువచేసి మాట్లాడు తున్నాడు తన భార్యదగ్గరా, అత్తదగ్గరా.

వెళ్లేలోగా విశాల్ జాయింట్ అకౌంట్‌లోని డబ్బు మొత్తం డ్రా చేసేసుకున్నాడు. మామగారి ద్వారా ఏదో బిజినెస్‌లో పెట్టుబడి పెట్టేడని తెలిసింది.

విశాల్ వెళ్ళిన మూడునెలలకి స్వాతికూడా యు.ఎస్. వెళ్ళిపోయింది. వెళ్లేముందు విమల కోడల్ని అడిగింది. "నగలు పట్టుకెళ్తున్నావా?" అని. "లేదండి. మా అమ్మావాళ్ళదగ్గర వదిలేసి వెళ్తున్నాను" అంది ఆ అమ్మాయి అతి కేజువల్‌గా.

విమల పట్టరానికోపంతో వణికిపోయింది. కోపాన్ని నియంత్రించుకునేసరికి కళ్ళల్లోకి నీళ్లొచ్చాయి. తనమీద నమ్మకం లేదా? లేక తనంత పరాయిదైపోయిందా?

కొడుకు ఫోన్‌చేసినా కోపంతో రెండుమూడుసార్లు ఫోన్ తియ్యలేదు, తనలోని కోపం తననే లావాలా కాల్చేస్తూంటే భరించలేక ఒకసారి తనే ఫోన్‌చేసి ఉక్రోషాన్ని వెళ్లగక్కేసింది.

"నేనేమైనా దొంగనా, మీ డబ్బూ నగలూ తినేస్తానా? నువ్విలా మారిపోతావని నేను కలలో కూడా అనుకోలేదురా" అంటూ, ఆ తర్వాత అట్నుంచి ఫోన్లు ఆగిపోయాయి.

ఇటు కూతురేమో "నీ కొడుకు బోలెడు సంపాదిస్తున్నాడుగా, వాడికి నీ డబ్బుతో అవసరమేం ఉండదు. నువ్వు రిటైరయ్యాక వచ్చే డబ్బు నాకే ఇవ్వాలి. ఈ వయసులో నీకు డబ్బుతో ఏంపని" అనడం మొదలుపెట్టింది.

"వీళ్లనేనా తను రెండు కళ్లనుకుంది! వీళ్లకోసమేనా తను జీవితాన్ని ధారపోసింది! మంచి తిండి తినకుండా, మంచి చీరకొనుక్కోకుండా తనకంటూ మరోలోకం లేకుండా బతికింది ఈ పిల్లలకోసమా!' పిల్లలు చేసిన గాయాల్తో విమల షాకైపోయింది.

హఠాత్తుగా ప్రస్తుతంలో కొచ్చి "మనిషే పోయాక సమాధి ఏమైపోతే ఏం అనసూయా" అంది.

ఈ ప్రయాణంలో మొదటిసారి నోరువిప్పి మాట్లాడిన విమలవైపు ఇద్దరూ ఆశ్చర్యంగా చూసారు.

"మనం పిల్లల్ని ఎలా పెంచినా వాళ్లు మనతో నెరపే సంబంధాలన్నీ వ్యాపార సంబంధాలే" అంది పొంతనలేకుండా, "బహుశా త్వరలోనే తెలుగుభాషనుంచి అనుబంధం అనేపదం అదృశ్యంకావచ్చు" అంది మళ్లీ.

అనసూయ, వనజ మొహమొహాలు చూసుకున్నారు ఆనందంగా. అనసూయ విమల భుజంమీద చెయ్యివేసి అనునయంగా –

"విమలా, పిల్లలు పెద్దవాళ్ళయ్యాక ఎవరి జీవితాలు వాళ్ళవి అనే అవగాహనకొచ్చి, వాళ్ళ సొంత వ్యవహారాల్లో మనం ఇన్వాల్వ్ కాకుండా ఉంటే వాళ్ళకీ మనకీ కూడా మంచిది. ఆలోచించి చూడు, కన్నప్పటినుంచి వాళ్లు జీవితంలో స్థిరపడేవరకూ మోసే బరువు చాలదా? ఇంకా వాళ్ల బరువుల్ని మనమెందుకు నెత్తికెత్తుకోవాలి? నీ కోడలు నగలు పుట్టింట్లో దాచుకుంటే నీకెందుకు కోపంరావాలి? పాజిటివ్‌గా ఆలోచించి చూడు, ఆ నగల్ని కాపాడ్డం అనేది ఎంత పెద్ద బాధ్యతో నీకెప్పుడూ స్ఫురించలేదా? అవి నీదగ్గరుంటే లేనిపోని టెన్షన్‌తప్ప నీకేమైనా మేలుజరుగుతుందా? ఇక నీ కూతురు, నువ్విచ్చిన అలుసుతోనే అది నీతో అలా మాట్లాడగలుగుతోంది. ఖచ్చితంగా చెప్పు, 'నీకివ్వాల్సిందేదో ఇచ్చేసాను, ఇక నా ఆర్థిక విషయాల్లో జోక్యం చేసుకోవద్ద'ని. ఇప్పుడే ఇలా ఉన్న పిల్లలు రేపు రిటైర్మెంటు తర్వాత కాలుచెయ్యి వంగితే చూస్తారని గ్యారంటీ ఏముంది? అప్పుడు మన సంపాదనే మనకి తోడుగా నిలుస్తుంది. మన పిల్లలకోసమని మనం స్వేచ్ఛని,

శాంతిని కోల్పోవాల్సిన అవసరం లేదు" గొంతులో మృదుత్వం నింపుకొని కన్విన్సింగ్‌గా మాట్లాడింది అనసూయ.

"నేనొకటి చెప్పనా, రాజ్యంలో లాగే మనుషుల్లోనూ సంక్షోభం పెరిగిపోతోంది. శాంతి, ఆనందం అనేవి మన మనస్సుల్లోనే దాక్కుని ఉంటాయి. వాటిని అక్కడే వెతుక్కోవాలి. పోగొట్టుకున్నచోటు వదిలి అరుణాచలంలో వెతుక్కుంటే ఎలా?" అంది వనజ.

"హియర్... హియర్.." అని చప్పట్లు కొట్టింది అనసూయ. హాయిగా నవ్వింది విమల.

ఆ సాయంకాలం వాళ్ల తిరుగుప్రయాణానికి బస్సెక్కినప్పుడు ఉదయం అగ్నిజ్వాలలా కన్పించిన అరుణాచలం కొండ లేత ఎర్రని కలువపువ్వులా కన్పించింది విమలకి.

*(నవంబరు – డిశంబరు 2011 సాహితీ స్రవంతి)*